క్లుప్తంగా

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

వైరా: మధ్యాహ్న భోజన వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ వైరా పట్టణ కార్యదర్శి అనుమోలు రామారావు పిలుపునిచ్చారు. సీఐటీయూ అనుబంధ మధ్యాహ్న భోజన వర్కర్ల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ధర్నా కోసం మంగళవారం వర్కర్లు ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లుకు నోటీస్ అందించారు. కార్యక్రమంలో వర్కర్లు కరుణ, భద్రమ్మ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నాగేశ్వరరావు



బోనకల్: బోనకల్‌కు చెందిన గుగులోతు నాగేశ్వరరావును బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియమితులయ్యారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల నుంచి ఐదుగురికి స్థానం దక్కగా మధిర నుంచి నాగేశ్వరరావుకు స్థానం కల్పించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని వెల్లడించిన ఆయన, తన నియమానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

'రావుల'ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

మధిర: హైదరాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ భవన్ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డిని మధిర బీఆర్ఎస్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మధిర పట్టణ, రూరల్ కమిటీ అధ్యక్షులు పల్లపోతు వెంకటేశ్వరరావు, రావూరి శ్రీనివాసరావు కలిసి మధిర ప్రాంతంలో బీఆర్ఎస్ పార్టీ పరిస్థితి గురించి వివరించారు.

చలివేంద్రం ప్రారంభం

ముదిగొండ: ముదిగొండలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

తహసీల్ ఎదుట ధర్నా

ఏన్కూరు: మండలంలో పలు గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. స్థానిక తహసీల్ ఎదుట గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ పేదల సంఘం ప్రధాన కార్యదర్శి కల్తీ రామచంద్రయ్య మాట్లాడుతూ.. బురదరాఘవాపురంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని, పోడుభూములకు పట్టాలు ఇవ్వాలని, ఎల్‌టీఆర్ భూ సమస్యను పరిష్కరించాలని అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు ముత్తయ్య, వెంకటనరసయ్య, నారాయణ, సాంభయ్య, నాగేశ్వరావు పాల్గొన్నారు.

అదుపు తప్పి చెట్టును ఢీకొట్టిన కారు

తల్లాడ: మండలంలోని మిట్టపల్లి సమీపాన మంగళవారం వేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. వైజాగ్ నుంచి వైరా మండలం స్టేజి పినపాకకు కారు వెళ్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న కె.నాగలక్ష్మి తలకు తీవ్ర గాయం కాగా 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తల్లాడ: మండలంలోని మిట్టపల్లి సబ్ స్టేషన్ పరిధిలో రామానుజవరం ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ దారా కృష్ణకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామానుజవరం, లక్ష్మీపురం, గ్రామాల్లోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

వ్యాస రచన పోటీలు

తల్లాడ: మండలంలోని కుర్నవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం క్షయ వ్యాధిపై తల్లాడ పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఈ వ్యాధిపై వ్యాసరచన పోటీలు నిర్వహించి.. విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం విద్యార్థులచే ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో టీబీ నోడల్ అధికారి పెద్ద పుల్లయ్య, సూపర్‌వైజర్ వై.సురేష్, కుర్నవల్లి పాఠశాల హెచ్ఎం ఝాన్సీ, ఎఎన్ఎం ఆదిలక్ష్మి, ఆశ వర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల 'విజ్ఞాన యాత్ర'

తల్లాడ: తల్లాడలో చిన్న తరహా పరిశ్రమలను అశ్వారావుపేటకు చెందిన వ్యవసాయ కళాశాల విద్యార్థులు మంగళవారం సందర్శించారు. విజ్ఞాన యాత్రలో భాగంగా తల్లాడలోని రైస్ మిల్లులు, జిన్నింగ్ మిల్లు, కోల్డ్ స్టోరేజ్‌లను పరిశీలన చేశారు. ధాన్యం నుంచి బియ్యం ఎలా తయారౌతున్నాయి, శీతల గిడ్డంగుల్లో మిర్చి నిల్వలు ఎలా చేస్తారూ, పత్తి నుంచి దూది ఏ విధంగా తీస్తారనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ టి.శ్రావణ్ కుమార్, డాక్టర్ ఎస్.మదుసూదన్ రెడ్డి, మోహన్‌రావు పాల్గొన్నారు.

'గృహలక్ష్మి' దక్కేనా?



ఖానాపురం గ్రామస్తులకు పట్టా అందిస్తున్న మంత్రి వెంకటరెడ్డి (ఫైల్)

- పైలెట్ ప్రాజెక్ట్ గ్రామంలో 107మంది లబ్ధిదారులకు అందిన పట్టాలు
- రీ సర్వేలో 19మందే ఎంపిక
- లబోదిబో మంటున్న గ్రామస్తులు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వైనం..

ముదిగొండ: తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పేదల పథకం గృహలక్ష్మి. ఇప్పటివరకు ఒకే ఇంట్లో రెండు, మూడు కుటుంబాలు నివాసముంటున్న వారు, పెంకుటిళ్లల్లో, శిథిలమైన ఇళ్లల్లో, అద్దెలకు ఉంటున్నవారు అనేకం. దీంతో ప్రభుత్వం గృహలక్ష్మి ప్రవేశపెట్టగా అనేకమంది పేదలు దరఖాస్తులు పెట్టుకుంటున్నారు.

నిబంధనల పేరిట..

రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో గత ఏడాది పంచాయతీ కార్యదర్శులు ఇంటింటి సమగ్ర సర్వే చేపట్టింది. ప్రజాపాలన సర్వేలో అర్హులను గుర్తించి నివేదికలు అందించారు. దీంతో ఓ కిలిక్కి వచ్చిన దరఖాస్తులకు సగానికి పైగా నిబంధనల ప్రకారం తిరస్కరించారు. ఉన్న దరఖాస్తు దారుల్లో గృహలక్ష్మి ఎవరికి వరించేనోనని లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

మండలంలో వివరాలిలా..

ముదిగొండ మండలంలో 25 జీపీలుండగా.. 33గ్రామాలున్నాయి. 85వేల మంది జనాభా ఉన్నారు. మొత్తం ఓటర్లు 58,485మంది, అయితే మండలంలో అందిన దరఖాస్తులు 3,384.. సర్వేలో 2,363మందిని గుర్తించారు. ఆన్‌లైన ప్రక్రియ పూర్తైన పిమ్మట పథకం అమలు పరిచేందుకు అధికారులు అన్నీ సిద్ధం చేశారు. స్థలాలున్న పేదలు పక్కా ఇళ్లు నిర్మించుకునేందుకు వేచి చూస్తున్నారు. అయితే ఇటీవల ప్రభుత్వం మండలంలోని చిన్న పంచాయతీకి తొలి విడుద నిధులు కానున్నట్లు ప్రకటించగా.. ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అతిథిగా విచ్చేసి లాంఛనంగా ప్రారంభించారు.

ఖానాపురం ఇందిరమ్మ ఇళ్లు ప్రొఫైల్..

గ్రామ సభలో గ్రామంలో 107మందికి ఇళ్లు లేవని గుర్తించి, వారి దరఖాస్తులు స్వీకరించారు. వారందరికి మంత్రిద్వారా పట్టాలు ఇప్పించారు. ఇప్పుడు రీసర్వే చేసి 19మందిని మాత్రమే అర్హులగా గుర్తించి 13 మంది ఇళ్లకు ముగ్గులు పోశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. అదే లిస్ట్ మంత్రి సమక్షంలో చదివి వినిపించారు. గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి ఇప్పుడు అధికారులు మూడో దశలో చూస్తామని మాటదాటవేస్తున్నారని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. అధికారులకు పైలెట్‌ప్రాజెక్ట్ తలనొప్పిగా మారింది.

అర్హులను గుర్తించాం..



మాకు అందిన దరఖాస్తులలో సిబ్బందితో పూర్తి సమగ్ర సర్వే చేపట్టాం. అర్హులున్న మాట వాస్తవమే. డాబ కలిగిన ఒకే ఇంటిలో మూడు కుటుంబాలున్నాయి. ప్రస్తుతం అలాంటి వారిని జాబితా నుంచి నిలిపివేశాం. అందులో అర్హులను గుర్తించాం. మొదటి విడత కోసం సర్వే చేసి 13మందిని గుర్తించి.. ముగ్గు పోయించాం. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విడతల వారీగా అర్హులందరికీ పథకం అమలు చేస్తాం.

– ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, ముదిగొండ

ఇంటి పట్టా ఇచ్చి.. కాదనడమేంటి..



మాకు ఇల్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. నాకు ఇద్దరు ఆడ పిల్లలు, రోజు కూలీ పనులకు వెళ్తున్నా.. కిరాయి ఇంట్లో ఉంటున్నాం. ఉన్న ఖాళీ స్థలంలో ప్రభుత్వం అందించే డబ్బులతో ఇల్లు నిర్మించుకోవాలని ఎదురుచూస్తున్నాం. అప్పుడు పట్టాలు ఇచ్చి.. ఇప్పుడు లిస్టులో నాపేరు తొలగించారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు.. తహసీల్దార్, ఎంపీడీఓకి వినతిపత్రాలు అందించాం. మాలాంటి పేదలను గుర్తించి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి.

– కొత్తపల్లి రాణి, ఖానాపురం

బంకర్ పెట్టింది బీఆర్ఎస్ హయాంలోనే..

- అసెంబ్లీలో ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి: కిష్టారం సైలోబంకర్‌తో సత్తుపల్లి మరో ఆఫ్ఘనిస్తాన్‌లా మారిందంటూ శాసన మండలిలో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌రావు విమర్శలు చేశారని.. అసలు సైలో బంకర్ పెట్టిందే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనేనని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అసెంబ్లీలో అన్నారు. మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆమె మాట్లాడుతూ.. కిష్టారం అంబేద్కర్ కాలనీకి 100మీటర్ల దూరంలోనే రెండేళ్ల కాలంలో కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించినా అప్పటి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రోద్బలంతో ప్రజలను మభ్యపెట్టి నిర్మించారని ఆరోపించారు. సైలో బంకర్ బాధితులకు ప్రభుత్వం తగు న్యాయం చేయాలని కోరారు. సత్తుపల్లి నియోజకవర్గంలో సీతారామ ప్రాజెక్టుకు మళ్లీ భూసేకరణ చేపట్టకుండా పాత ఎన్టీఆర్ కాలువ, పాత ఫీడర్ ఛానల్స్ మరమ్మతులు చేపట్టి ఉపయోగించాలని రైతులు కోరుతున్నారని పేర్కొన్నారు. దీనివల్ల రూ.200 కోట్ల వరకు ప్రభుత్వం ఆదా అవుతుందని ఆమె తెలిపారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనకు పోరాటం



మాట్లాడుతున్న రాంనారాయణ

వైరా: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్, హెల్త్ కార్డుల సాధనకు మరో పోరాటం చేయక తప్పదని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి కె.రాంనారాయణ అన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం వైరాలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైరాలో నిర్వహించే సంఘం జిల్లా మహాసభల విజయవంతానికి కృషి చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు వెంకటేశ్వరరావుతో పాటు మాటేటి వేణుగోపాల్, ఖాదర్, మైసా పాపారావు, మోహిద్దీన్, శ్రీనివాసరావు, రాజారావు, వెంకటేశ్వరరావు, కృష్ణార్జునరావు, బాబూరావు, ప్రసన్నన్, రవితేజ, విజయ్ లక్ష్మణాచారి, తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు..

కల్లూరు: రాష్ట్ర వ్యాప్తంగా వర్కింగ్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే ఖాదర్ బాబా కోరారు. మంగళవారం కల్లూరులో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి కమిటీ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ బాధ్యులు సతీష్, శ్రీకాంత్, నియోజకవర్గ కమిటీ బాధ్యులు ధర్నాసి బాలరాజు, వేము రాంబాబు, కోట పుల్లయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

లో ఓల్టేజీ సమస్య రావొద్దు..



లాలాపురంలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న డీఈ రామారావు

కొణిజర్ల: ప్రస్తుత వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు బాగా పెరుగుతున్న కారణంగా కరెంట్ డిమాండ్‌కు మించి అధిక వినియోగం వల్ల లో ఓల్టేజి సమస్య తలెత్తకుండా గ్రామాల్లో అన్ని చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఖమ్మం డీఈ(ఆపరేషన్స్) నంబూరి రామారావు సూచించారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని మండలంలోని లాలాపురం గ్రామంలో లో రెండు 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పెద్దగోపతి సబ్ డివిజన్ ఏడీఈ ఎల్.తిలక్, కొణిజర్ల ఏఈ కె.రాజారత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం



శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఏన్కూరు: మండలంలో శ్రీ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ 13వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు గోరంట్ల శ్రీనివాస్‌చౌదరి, కమిటీ సభ్యులు రంగారావు, రమేష్, ప్రభావతి రెడ్డి ఉన్నారు.

లక్ష్మీనారాయణపురంలో..

వేంసూరు: మండలంలోని లక్ష్మీనారాయణపురంలో కొలువుదీరిన శ్రీ సత్య అభయ ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభయ్యాయి. నాభిశిలకు అభిషేక పూజలు నిర్వహించారు.వల్లీమ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణేశ్వర స్వామి కల్యాణ వేడుకలు నిర్వహించారు.

అంకమ్మ దేవాలయంలో పూజలు

ముదిగొండ: మండలపరిధిలోని కమలాపురంలో అంకమ్మ జాతర సందర్భంగా అంకమ్మ దేవాలయంలో శ్రీఅంకమ్మ, మద్దిరావమ్మ, మహాలక్ష్మి, పెద్దమ్మతల్లికి వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు భోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్రీడా సామగ్రి తనిఖీ

కల్లూరురూరల్: మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ నిధుల నుంచి కొనుగోలు చేసిన క్రీడా సామగ్రిని అధికారుల బృందం మంగళవారం తనిఖీ నిర్వహించింది. పేరువంచలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనుగోలు చేసిన క్రీడా సామగ్రి పరికరాలను ఎంఈఓ పత్తిపాటి నివేదిత, హెచ్ఎం సుదర్శన్‌రావు, పీఈటీ అప్పారావు, క్రీడా నిపుణులు బోడా భీమా, పసుపులేటి వీర రాఘవయ్య ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహించారు.

ఆశా వర్కర్ల ధర్నా

ఎర్రుపాలెం: ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి సగ్గుర్తి సంజీవరావు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని బనిగండ్లపాడు పీహెచ్‌సీ ఎదుట ఆశా వర్కర్లతో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ నెల 19న ఖమ్మం కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను ఆశ కార్యకర్తలు విజయవంతం చేయాలన్నారు. అనంతరం వైద్యాధికారికి వినతిపత్రం అందించారు.

కారేపల్లి: ఆశా వర్కర్లకు రూ.18వేల వేతనం ఇవ్వాలని కోరుతూ.. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు సింగరేణి తహసీల్దార్ సంపత్‌కుమార్‌కు మంగళవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి కె.నరేందర్ మాట్లాడుతూ.. ఆశాలకు చాలీచాలని వేతనాలు అందిస్తుందన్నారు. రాధ, కుమారి, సరస్వతి, లక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆర్డీఓ పర్యటన

ముదిగొండ: మండలంలోని కట్టకూరు, మాదాపురం గ్రామాల్లో మంగళవారం ఖమ్మం ఆర్డీఓ గరిడి నరసింహారావు పర్యటించారు. ఆయా గ్రామాల్లో పంటలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ఎస్ఆర్ఎస్పీ కాలువ ద్వారా నీటిసరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని రైతులు కోరగా.. ఆయన సాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ఏఓ వేణు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దాడులను అరికట్టాలి

మధిర: క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని పాస్టర్ల అసోసియేషన్ ఖమ్మం జిల్లా గౌరవ అధ్యక్షుడు వేముల సత్యం అన్నారు. మంగళవారం మధిర బంజారా కాలనీ ప్రభు యేసు సంతోష్ ప్రార్థన మందిరంలో సమావేశం నిర్వహించారు. ఆనందరావు, జయకుమార్, రాంబాబు, రాధాకృష్ణ, రాజారత్నం, జయరాజు ఉన్నారు.

కాంగ్రెస్ సంబురాలు

వైరా/సత్తుపల్లిటౌన్:సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లును ప్రవేశపెట్టిన సందర్భంగా మంగళవారం సత్తుపల్లిలో, వైరాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన మంగళవారం సంబురాలు నిర్వహించారు. సత్తుపల్లి స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి రింగ్ సెంటర్‌వరకు ర్యాలీ నిర్వహించి టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. అదే విధంగా వైరాలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏదునూరి సీతారాములు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, బీసీ సెల్ అధ్యక్షుడు చప్పిడి వెంకటేశ్వరరావు, బోళ్ల గంగారావు, మట్టూరి కృష్ణారావు, పమ్మి అశోక్, పణితి శ్రీను, పల్లపు కొండలు, దార్న రాజశేఖర్, కోసూరి శ్రీను, చెరుకూరి కిరణ్, బొర్రా గోవిందరావు జానీ, పూర్ణ, వీరబాబు, అన్వర్, కోటయ్య, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు చెన్నారావు, నర్సింహారావు, ఆనంద్‌బాబు, సుజలరాణి, కమల్‌పాషా పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చింతకాని: మండలంలోని సీతంపేట గ్రామంలో లబ్ధిదారులకు మంగళవారం కాంగ్రెస్ నాయకులు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న గ్రామానికి చెందిన పణితి సైదమ్మ, నర్సింగుల వెంకట్రావమ్మ లకు వైద్య ఖర్చుల నిమిత్తం భట్టివిక్రమార్క సిఫార్సుతో మంజూరైన రూ.50 వేల విలువైన చెక్కులను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బస్వయ్య, కొండలరావు, యాకోబు, శుభాష్ పాల్గొన్నారు.

ఫ్రీజర్ బాక్స్ బాగు చేయండి

కారేపల్లి: సింగరేణి గ్రామ పంచాయతీకి చెందిన ఫ్రీజర్ బాక్స్ (శవ పేటిక) పాడైపోయిందని, మరమ్మతులు చేయించాలని సింగరేణి ప్రజలు మంగళవారం మండల అభివృద్ధి అధికారి సురేందర్, గ్రామ కార్యదర్శి నిరంజన్ లకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో ఎవరైన మరణిస్తే, వారి బంధువులు వచ్చే వరకు మృతదేహాన్ని భద్రపరిచేందుకు వినియోగించే శవపేటికలో ఉంచేవారమని, ప్రస్తుతం మరమ్మతులకు గురైందన్నారు. వెంటనే మరమ్మతులు చేయించి వాడుకలోకి తీసుకురావాలని వినతిలో పేర్కొన్నారు. కార్యక్రమంలో రాములు, రామారావు, అంజయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



మాట్లాడుతున్న ఏఎంఓ

ముదిగొండ: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత చదువులు చదవాలని ఏఎంఓ రవికుమార్ అన్నారు. మంగళవారం ముదిగొండ మండలపరిషత్ ఉన్నత పాఠశాలలో.. హెచ్ఎం కంబంపాటి శాంతి అధ్యక్షతన పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, ఎంఈఓ రమణయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ రాణి, పద్మా చారిటబుల్ ట్రస్టుచైర్మన్ జనార్ధన్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం



భోజనం వడ్డిస్తున్న దాతలు

మధిర: మల్లాది సేవా సమితి ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు వేముల తిరుపతిరావు అన్నారు. మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు మల్లాది వాసు, సవిత దంపతుల వివాహ వార్షికోత్సవ సందర్భంగా మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారి ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని తిరుపతిరావు ప్రారంభించారు. మల్లాది యశ్వంత్ చౌదరి, గూడెల్లి నాగరాజు, రాజేష్, బాబురావు, మట్టూరి రాజా తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

ఏన్కూరు: యాజమాన్య పద్ధతులతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి నర్సింహారావు అన్నారు. మండలంలోని నాచారంలో పెసర పంటలను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. పురుగు నివారణకు మందులు వాడాలన్నారు. పొగాకులద్దె పురుగు నివారణకు మోనోక్రోటోఫాస్1.6 ఎంఎల్, క్లోరిపైరిఫోస్ 2.5 ఎంఎల్ లను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు అశోక్, బాలకృష్ణ, శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

పెనుబల్లి: మండలంలోని తాళ్లపెంట గ్రామానికి చెందిన గజ్జెల చిన్న నాగేష్‌కు ఇటీవల ఎడమకాలు తీసివేశారు. దీంతో గజ్జెల చిన్న నాగేష్ కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ నాయకులు కొత్తగుండ్ల అప్పారావు, ఆయన కూతురు ప్రశాంతి, కాకా సీతారాములు, మాధవరావు, గువ్వల బాలకృష్ణారెడ్డిలతో పాటు మరికొంత కలిసి రూ.18,200లను బాధిత కుటుంబానికి అందజేశారు.

వైరా లయన్స్‌క్లబ్‌కు అవార్డులు

వైరా: వైరా లయన్స్‌క్లబ్ అందిస్తున్న ఉత్తమ సేవలకు గాను 10సేవా అవార్డులు లభించాయి. గత ఏడాది జూలై నుంచి ఈ ఏడాది మార్చి వరకు వైరా లయన్స్‌క్లబ్ 150కి పైగా సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను అవార్డులు లభించాయి. ఖమ్మం మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన లయన్స్‌క్లబ్ రీజియన్-5 మీట్‌లో రీజియన్ చైర్మన్ డీపీసీ రావు చేతుల మీదుగా ఉత్తమ జోన్ చైర్మన్‌గా పెనగొండ ఉపేందర్‌రావు, సెకండ్ బెస్ట్ జోన్ చైర్మన్‌గా ఉంద్రు వరలక్ష్మి, ఉత్తమ ప్రెసిడెంట్‌గా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చింతలపూడి వెంకటేశ్వరరావు, ఉత్తమ సెకండ్ బెస్ట్ ట్రెజరర్‌గా మరికంటి రాంగోపాల్ అవార్డులకు అందుకున్నారు. ఈ సందర్భంగా పీడీజీ డాక్టర్ కాపా మురళీ కృష్ణ క్లబ్ సభ్యులను అభినందించారు.


వీకేఓసీ ప్రైవేటీకరణకు వ్యతిరేకిస్తూ..

సత్తుపల్లిరూరల్: వీకేఓసీ ప్రైవేటీకరణకు వ్యతిరేకిస్తూ.. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈనెల 19న నుంచి 22వరకు కొత్తగూడెం హెడ్‌ఆఫీస్ ఎదుట చేపట్టే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి సముద్రాల సుధాకర్ అన్నారు. ఈ నెల 6న చేసుకున్న ఒప్పందాన్ని విస్మరించి యాజమాన్యం తమ లాభం కోసం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఉపాధ్యక్షుడు భరణి, బ్రాంచ్ కోశాధికారి నర్సింహారావు, కౌన్సిల్ మెంబర్ వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, మహేష్, నరేందర్, రాజేష్, వెంకటేశ్వర్లు, వినయ్, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

గోదాంల అభివృద్ధికి కృషి

ఎర్రుపాలెం: మార్కెట్ కమిటీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న గోదాంల అభివృద్ధికి కృషి చేస్తానని మధిర మార్కెట్ చైర్మన్ బండారు నర్సింహారావు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని గోదాంలను పరిశీలించారు. మామునూరు జెడ్పీ పాఠశాలలో ఎస్సెస్సీ విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఎంఈఓ మురళీమోహన్‌రావు, హెచ్ఎం శ్యాంబాబు, పీడీ జమలయ్య, ఉపాధ్యాయులతో పాటు మార్కెట్ వైస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, డైరెక్టర్ బాబురావు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



వైరారూరల్: విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందిస్తున్న దృశ్యం

వైరారూరల్: మండలంలోని పాలడుగు జెడ్పీహెచ్ఎస్‌లో పది విద్యార్థులకు 2000–21 బ్యాచ్ పూర్వ విద్యార్థులు పరీక్ష సామగ్రి అందించారు. పూర్వ విద్యార్థులు వినోద్‌కుమార్, వాణి, పర్వీన్, కుష్మావతి, హెచ్ఎం ఇమ్మానియేల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గన్నవరం జెడ్పీహెచ్ఎస్‌లో..

మండలంలోని గన్నవరం ఉన్నత పాఠశాలలో పది విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించి.. విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. హెచ్ఎం చావా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పరీక్షలంటే భయం వీడాలన్నారు. కార్యక్రమంలో ఏఏపీసీ చైర్మన్ కృష్ణవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నకోరుకొండి ప్రభుత్వ పాఠశాలలో..

కల్లూరురూరల్: మండలంలోని చిన్నకోరుకొండి ప్రభుత్వ పాఠశాలలో పది విద్యార్థులకు ఆశ్రి ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రపూర్ణ, రామకిషోర్‌రెడ్డి దంపతులు పరీక్ష సామగ్రి అందించారు. మండలంలోని పలు గ్రామాల్లో విద్యార్థులకు ముచ్చవరం ఉపసర్పంచ్ షరాబు వెంకటేశ్వరరావు, ప్రభుత్వ ఉపాధ్యాయులు షేక్.జాన్‌సాహెబ్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. పలు పాఠశాలల హెచ్ఎంలు మధుసూదన్‌రావు, రమణయ్య, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, కృష్ణారావు, సుధాకర్ పాల్గొన్నారు.

న్యూలక్ష్మీపురం కేజీబీవీలో..

ముదిగొండ: మండలంలోని న్యూలక్ష్మీపురం కేజీబీవీలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినులకు ఓ స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పరీక్ష సామగ్రి అందించారు. వీటిని ఎంఈఓ రమణయ్య, తహసీల్దార్ సునిత పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



కల్లూరురూరల్: చిన్నకోరుకొండి జెడ్పీ ఉన్నత పాఠశాలలో..



చింతకాని: పందిళ్లపల్లి ఉన్నత పాఠశాలలో..

చింతకాని: మండలంలోని పందిళ్లపల్లి ఉన్నత పాఠశాలలోని పది విద్యార్థులకు కాంగ్రెస్ నాయకులు ఇనుకుర్తి నాగసూరారెడ్డి పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందించారు.